క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

జమ్మలమడుగు రూరల్ : నారాపుర వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం సందర్భంగా జమ్మలమడుగు పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ, ఏఈ శేషగిరిరావు, రాజబాబులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని వారు తెలిపారు. ప్రజలు సహకరించాలని వారు కోరారు.

ఘనంగా గ్రామోత్సవం

లింగాల : మండలంలోని మురారిచింతల గ్రామంలో పునఃనిర్మితమైన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం దేవతామూర్తుల శిలా విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తదితర పూజలను రామప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాకారులు నిర్వహించిన నాటక ప్రదర్శన భక్తులను అలరించాయి.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె పంచాయతీ పరిధి చంద్రగిరి గ్రామంలో బుధవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు మురారిచింతలకు ఎంపీ రాక

లింగాల : మురారిచింతల గ్రామానికి బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రానున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు దంతలూరు కృష్ణ తెలిపారు. గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి దేవతామూర్తుల శిలా విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజస్తంభారోహణ, శిఖర, కలశ స్థాపన కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, బైరెడ్డి సిద్ధార్థరెడ్డిలు పాల్గొంటారన్నారు.

15న హుండీ లెక్కింపు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట-బుగ్గలేటిపల్లె సమీపంలో వెలసిన గంగమ్మ దేవస్థాన హుండీని ఈనెల 15న ఉదయం 11 గంటలకు లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ పి.సురేష్ కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

45 క్వింటాళ్ల జీలగలు మంజూరు

కమలాపురం : మండలానికి 45 క్వింటాళ్ల జీలగలు (పచ్చిరొట్ట ఎరువు) మంజూరు అయ్యాయని ఏఓ సరస్వతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలసిన రైతులు మీ పరిధిలోని ఆర్‌బీకేలకు వెళ్లి జీలగలు తీసుకోవచ్చని ఆమె అందులో తెలిపారు. రైతులు తమ వెంట పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తప్పనిసరిగా తీసుకెళ్లి బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని జీలగలు పొందాలని ఆమె తెలిపారు. 10 కిలోల పూర్తి ధర రూ.790 ఉండగా 50 శాతం సబ్సిడీ పోను మిగిలిన రూ.395 చెల్లించి జీలగలు తీసుకెళ్లాలని ఆమె తెలిపారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

సింహాద్రిపురం : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి శేఖర్ విద్యార్థులు క్యారమ్స్, చెస్, లూడో, స్నేక్ అండ్ లాడర్ ఆటలు ఆడించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

వేంపల్లె : వేంపల్లె ప్రభుత్వాసుపత్రిలోని ల్యాబొరేటరీని మంగళవారం పులివెందుల మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్ టెక్నీషియన్ రాములు నాయక్‌తో మలేరియా కేసులు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దోమ కాటువలన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వస్తాయని... గ్రామాల్లో ఆరోగ్య, ఆశాకార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించాలన్నారు.

సిఫారసు బదిలీలను రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: కౌన్సిలింగ్ విధానికి విఘాతం కలిగిస్తూ ప్రజాప్రతినిధుల సిఫారసు మేరకు చేపట్టిన టీచర్ల అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కడప జిల్లా పరిషత్తు కార్యాలయ ఆవరణంలో జరిగిన ఏపీటీఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వేసవి సెలవుల్లో పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలను చేపడతామని ఓవైపు విద్యాశాఖ మంత్రి చెబుతూనే మరోవైపు సిఫారసు బదిలీలను చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతంలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు.వెంటనే సిఫారసు బదిలీలు రద్దు చేసి బదిలీలు, ప్రమోషన్లకు మార్గదర్శకాల షెడ్యూల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, గురయ్య, సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’ను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

కమలాపురం : ‘జగనన్నకు చెబుదాం’ను సద్వినియోగం చేసుకోండని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం దేవరాజుపల్లె సచివాలయ పరిధిలోని చిన్నపుత్త, జీవంపేట, సముద్రంపల్లె గ్రామాల్లో ఎంపీటీసీ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే వారి సమస్యలు తెలుసుకున్నారు. రేషన్ కార్డు, ఉపాధి పనులు, వీధి దీపాలు తదితరవి కావాలని ప్రజలు కోరడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఇంకా పథకాలు రానివారు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు.

జగనన్న చెబుదాం... 1902 డయల్ చేయండి...

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్నకు చెబుదాం... అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని, 1902కు డయల్ చేసి తమ సమస్యలు సీఎంకు వివరించవచ్చని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారమే సీఎం జగనన్న ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారని, ప్రజలు తమ అపరిష్కృత సమస్యలు ఉంటే పరిష్కరించుకోవచ్చని అన్నారు.

ఇప్పటి వరకు ప్రయత్నించి పరిష్కారం కాని ప్రజా ఫిర్యాదుల కోసమే ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామాల్లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇతర పార్టీ నాయకులు ఇంతవరకు పర్యటించలేదని ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నాయకులు మాత్రమే ఈ గ్రామాల్లో పర్యటిస్తున్నారన్నారు. 2021 ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి ఈ గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేశారన్నారు. అయితే ఈ గ్రామాల్లో టీడీపీ నాయకులు అర్ధరాత్రి ఇంటియజమానులకు తెలియకుండా జెండాలు కట్టారు తప్ప ప్రజలతో కలసి వారిసమస్యలను తెలుసుకోలేదన్నారు. కార్యక్రమంలో దస్తగిరిరెడ్డి, కిషోర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, శివారెడ్డి, పెద్దచెప్పలి చిన్ని, వెంకటసుబ్బయ్య, మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేడు లేటపల్లి సచివాలయ పరిధిలో..

మండలంలోని లేటపల్లె సచివాలయ పరిధిలోని పొడదుర్తి, వెంకటాపురం, ఎర్రబల్లె, కొత్తపల్లె గ్రామాలలో బుధవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ చలపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతుండటంతో రాష్ట్రంలో ప్రజారంజక పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చిన్నదండ్లూరు గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడే ఉన్న అధికారుల సమక్షంలో పరిష్కరించారు. డ్రైనేజీ పనులను త్వరగా చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్ రెడ్డి, ఈశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, నాగమునిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, రామాంజనేయరెడ్డిలు పాల్గొన్నారు.

నేడు పొన్నంపల్లెలో...

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని పొన్నంపల్లె గ్రామంలో బుధవారం ఉదయం 6 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మైలవరం మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

లింగాల తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ

లింగాల : వేముల మండలం తహసీల్దార్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ లింగాల తహసీల్దార్‌గా బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారని రెవెన్యూ అధికారులు తెలిపారు. వేముల మండల డీటీగా పనిచేస్తున్న త్రిభువన్ రెడ్డి లింగాల డీటీగా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. లింగాల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న శేషారెడ్డి వేముల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

రాష్ట్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్: రాష్ట్రంలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని లక్ష్యా అకాడమీలోని ఉద్యోగ అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ముప్పై వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు. నాలుగేళ్లుగా కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకుంటూ ఉద్యోగ నోటిఫికేషన్ కొరకు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్ల పెంపు ఆలోచనను విరమించుకోవడంతో పాటు వయోపరిమితిని 45 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ వ్యసనంతో భవిష్యత్ పతనం



ఉచిత విద్య ఉపాధ్యాయ బృందంతో సీఐ రాజు

పులివెందుల టౌన్ : విద్యార్థులు మొబైల్ వ్యసనంతో బంగారు భవిష్యత్ పతనమవుతుందని అర్బన్ సీఐ రాజు తెలిపారు. మంగళవారం స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సహకారంతో పాలీసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు గత 25 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, అర్బన్ సీఐ రాజులు హాజరై మాట్లాడుతూ ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సేవలు వెలకట్టలేనివన్నారు. తల్లిదండ్రులు, గురువులే ప్రత్యక్ష దేవుళ్లు ఉచిత విద్య ఉపాధ్యాయ బృందమన్నారు. అనంతరం మాక్ పాలీసెట్ పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం రామసుబ్బారెడ్డి, ఓబుళరెడ్డి, వెంకటనారాయణ, సుబ్బారెడ్డి, శేష మహేశ్వరమ్మ, శైలజ, మహేశ్వరరెడ్డి, అమరనాథరెడ్డి, విజయానందన్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, శ్యాంకుమార్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే ఏదైనా సాధించవచ్చు



విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

పులివెందుల రూరల్ : కష్టపడితే ఏదైనా సాధించవచ్చునని పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శనివారం పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో మంచి మార్కులు సాధించిన పవన్‌కుమార్, లక్ష్మీ జశ్వంత్‌లు రాష్ట్రస్థాయిలో జరిగిన టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి కింద రూ.30వేల నగదు అందుకున్న సందర్భంగా ఆ విద్యార్థులను డీఎస్పీ అభినందించారు. అలాగే పులివెందుల డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాసులు ఏలూరుకు బదిలీ కావడంతో పాఠశాల హెడ్మాస్టర్ కమలనాథ శర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, డిష్ వెంకటరెడ్డిలు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ అరిఫుల్లా, తదితరులు

తొండూరు : స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి రక్తహీనత కలిగిన వారికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య విద్య ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల కాన్పులు, సాధారణ కాన్పుల ప్రయోజనాలు గురించి, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం సైదాపురం గ్రామ సర్పంచ్ ఓబుళరెడ్డి గర్భిణులకు చిక్కీలు, లడ్డూలు, అరటి పండ్లను అందించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ, హెల్త్ సూపర్‌వైజర్ శశికళ, కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మేలు జాతి పశువులతో లాభదాయకం



లేగదూడల ప్రదర్శన నిర్వహిస్తున్న పశువైద్యులు

చక్రాయపేట : ప్రతి రైతు మేలుజాతి పశువులను ఎంచుకుంటే లాభదాయకంగా ఉంటుందని పశువైద్యాధికారి సాదిక్‌బాషా తెలిపారు. మంగళవారం మండలంలోని వరికుంటపల్లెలో పశువైద్య శిబిరంతో పాటు లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించి పశువులకు చికిత్సలు చేశారు. అనంతరం లేగదూడల ప్రదర్శన నిర్వహించి రైతులకు బహుమతులను అందజేశారు. అనంతరం రైతులకు అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యులు ఓబుళరెడ్డి, రమేష్, రవీంద్రనాథరెడ్డి, శివరామిరెడ్డి, సిబ్బంది పాల్గొ న్నారు.

‘జీ.వి పుట్‌బాల్’పై ఫిర్యాదు చేయవచ్చు

● కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్: జిల్లాలో జీ.వి. పుట్‌బాల్ అనే ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లో సభ్యులుగా చేరాలనీ, ఈవెంట్లు నిర్వహిస్తూ, ప్రజలను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో డీఎస్పీ మాట్లాడారు. జీ.వి పుట్‌బాల్ యాప్‌పై సుమోటోగా పోలీసుల ఆధ్వర్యంలోనే కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు 12 మంది ఈవెంట్ ఆర్గనైజర్లపై చర్యలు తీసుకున్నామన్నారు. ఇంకా ఏదైనా సమాచారం వుంటే తమ దృష్టికి తీసుకురావాలనీ అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కేసుపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ద్వారా విచారణ కొనసాగిస్తున్నామన్నారు. ఎవరైనా బాధితులు వుంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

ఏజెంట్ల మాయలో పడొద్దు

కడప అర్బన్: జీవనోపాధి, ఉద్యోగం, వ్యాపారం, ఇతర ప్రయోజనాల దృష్ట్యా గల్ఫ్ లేదా ఇతర దేశాలకు వెళ్లదలచుకున్న జిల్లా వాసులు అక్రమ ఏజెంట్లు చెప్పిన మాటలు విని మోసపోవద్దని, ప్రభుత్వం ద్వారా నమోదు/ రిజిస్టర్ కాబడిన రిక్రూటింగ్ ఏజెంట్ల ద్వారా మాత్రమే వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలనీ ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. ఈమేరకు మంగళవారం ఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఏటా కొన్నివేల మంది అమాయకులు కువైట్,సౌదీ, ఖతర్, ఇతర దేశాలకు గృహకార్మికులుగా/ ఇంటి పనిమనిషిగా పనిచేయుటకు అక్రమ పద్ధతుల ద్వారా పంపబడుతున్నారని, ఈ విషయంలో అక్రమ ఏజెంట్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. జీవనోపాధి, ఉద్యోగం, వ్యాపారంలు మొదలగు ప్రయోజనాల దృష్ట్యా గల్ఫ్ లేదా విదేశాలకు వెళ్లదలచుకున్న వారు పీఓఈ (ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రేట్స్) ద్వారా నమోదు, రిజిస్టర్ కాబడిన రిక్రూటింగ్ ఏజెంట్ల ద్వారా మాత్రమే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఇప్పటికే గల్ఫ్ లేదా విదేశాల్లో ఉంటూ ఇ బ్బందులు గురవుతున్న వారి గురించి, లేదా మీ సంబంధీకుల గురించి గానీ మదద్ వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవాలని ఎస్పీ సూచించా రు. అక్రమ ఏజెంట్లకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ (91211 00650, 85008 6892 2)కు తెలియజేయాలనీ ఎస్పీ అన్బురాజన్ సూచించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : అంగన్‌వాడీ పోస్టుల ఖాళీలను ప్రతిభ ఆధారంగానే భర్తీచేస్తారని అభ్యర్థులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ ఛాంబర్‌లో జమ్మలమడుగు, ముద్దనూరు ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ, ఐసీడీఎస్ అధికారులు ముంతాజ్ బేగం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పఠనంతోనే జ్ఞానాభివృద్ధి

జమ్మలమడుగు : పుస్తకాల పఠనం విద్యార్థుల జ్ఞానాభివృద్ధికి తోడ్పడుతుందని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాసులు, లైబ్రేరియన్ జింకా చంద్రశేఖర్‌లు తెలిపారు. మంగళవారం గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణతోపాటు నీతి పద్యాల పఠనం, ప్రముఖుల జీవితచరిత్రలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలతోపాటు గ్రంథాలయానికి కనీసం వారంలో మూడు రోజుల్లో మూడు గంటల సమయం కేటాయించాలన్నారు. గ్రంథాలయంలో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షల మెటీరియల్, విద్యార్థులకు వివిధ పోటీలకు సరిపడ్డ పుస్తకాలు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ, పాఠకులు పాల్గొన్నారు.

తపాలాశాఖ యూనియన్ల రద్దు దారుణం

కడప వైఎస్సార్ సర్కిల్: కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ యూనియన్లను రద్దు చేయడం దారుణమని అఖిల భారత ఉద్యోగుల సంఘం గ్రూప్-సి డివిజనల్ కార్యదర్శి జీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప డివిజన్ తపాలాశాఖ కార్యాలయం ఎదుట తపాలాశాఖ యూనియన్ల రద్దును నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా యూనియన్లను గుర్తింపును రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే రద్దు చేసిన యూనియన్లను వెంటనే పునరుద్ధరణ చేయాలన్నారు. యూనియన్ డివిజన్ సెక్రటరీలు సలామ్, పాలకొండ్రాయుడు, గోవిందు, రమాకాంత్ పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ లక్ష్యాల కోసం కృషి చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్: పోస్టల్ శాఖ ఎంచుకున్న లక్ష్యాల సాధనకు ఉద్యోగులు కృషి చేయాలని కడప డివిజన్ ఇన్‌చార్జ్ పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని తపాలాశాఖ ప్రధాన కార్యాలయంలో గత ఆర్థిక సంవత్సరంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ లక్ష్యాలను బాగా చేసినందుకు ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు పోస్టల్ శాఖ అభివృద్ధి కృషి చేసేందుకు పాటుపడాలన్నారు. కడప డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్‌లు విజయ్ భాస్కర్, రమశంకర్, ఇన్‌స్పెక్టర్లు సుబ్బరాయుడు, పిఎల్‌ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్ పాల్గొన్నారు.

సామూహిక ప్రార్థనలు

కడప కల్చరల్ : భజరంగ్‌దళ్‌ను నిషేధించాలని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపును నిషేధిస్తూ విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి, భజరంగ్‌దళ్ రాష్ట్రీయ సంయోజక్‌ల పిలుపు మేరకు మంగళవారం దేవాలయాల్లో సామూహికంగా హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 200 దేవాలయాలలో దాదాపు 1500 మంది కార్యకర్తలు, మహిళలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పాత బస్టాండులోని వీహెచ్‌పీ కార్యాలయంలో సాయంత్రం 7 గంటలకు మహిళా భక్తులు రాష్ట్ర ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ రామమహేష్, గంగిరెడ్డి, సురేంద్ర తదితరుల ఆధ్వర్యంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



వైద్య సేవలపై ఆరా తీస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అజయ్‌రెడ్డి

వేముల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వేల్పుల గ్రామంలో నిర్మించిన సచివాలయ భవన సముదాయాన్ని వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డితో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ భవనం, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్, సొసైటీ కార్యాలయం, డిజిటల్ లైబ్రరీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిలో సచివాలయ భవన సముదాయం నిర్మించడం ఎంతో ఆదర్శంగా కనిపిస్తున్నాయని.. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మాణాలు జరిగాయని ప్రశంసించారు. విలేజ్ క్లినిక్ ద్వారా గ్రామంలో అందుతున్న వైద్య సేవలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయం ద్వారా ప్రజలు పొందుతున్న సేవలను అక్కడి సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం ఆయనను వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ బాబ్‌జాన్, సొసైటీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వద్దిరాలలో వీధులు జలమయం



వద్దిరాల బీసీ కాలనీలో నిలబడ్డ వర్షపునీరు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలం వద్దిరాల బీసీ కాలనీలోని రోడ్లు మంగళవారం కురిసిన వర్షానికి జలమయమయ్యాయి. మండలంలో వారంరోజులుగా చెదురుమదురుగా వర్షాలు పడుతున్నాయి. దాదాపు గంట పాటు కుండపోతగా కురవడంతో వర్షపు నీరు వీధుల్లో పార్లిపారింది. దీంతో వీధులు జలమయమయ్యాయి. ఇక వారం రోజుల్లో సేద్యం కూడ మొదలు పెట్టాలని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో పంటలు సైతం ముందస్తుగానే వేయాల్సి ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు మే నెలలో కురిసిన వర్షాలు ఉపశమనం కలిగించాయని చెప్పవచ్చు.

సర్వేను సమగ్రంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జుబేద

వల్లూరు : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీఓ జుబేద తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం సచివాలయ మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలన్నారు. ప్రతిరోజు స్పందనను నిర్వహించాలని, తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరును వేయాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా వచ్చే వినతులను, సమస్యలను పరిష్కరించడానికి పూర్తిస్థాయిలో సిద్ధంగా వుండాలన్నారు. తహసీల్దార్ అమరేశ్వరి పక్కా గృహాల ఓటీఎస్ కార్యక్రమం గురించి చర్చించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ప్రసాద్, సూపరింటెండెంట్ రఘు పాల్గొన్నారు.

సాధనతో లక్ష్యాన్ని జయించవచ్చు



కాగితపు పూల తయారీ మెళకువలు నేర్పుతున్న రంగనాయకులు

కడప కల్చరల్ : సాధనతో ఎంత ఉన్నత లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని లైబ్రేరియన్ జేమ్స్ అన్నారు. వేసవి సెలవులను పురస్కరించుకుని జిల్లా కేంద్ర గ్రంథాలయం రూపొందించిన ‹చదవడం మాకిష్టం› కార్యక్రమాన్ని ప్రత్యేక శిక్షణ శిబిరంలో నిర్వహిస్తున్నారు. మంగళవారం కడప నగరం కొండాయపల్లెలోని కేంద్ర గ్రంథాలయ కార్యాలయంలో జరిగిన శిక్షణలో భాగంగా ఆయన లక్ష్య సాధనకోసం చూపాల్సిన శ్రద్ధ గురించి వివరించారు. తొలుత చదివే గుణాన్ని కథలు వినడం, చెప్పడం ద్వారా నేర్చుకోవచ్చని సూచించారు. చిట్టిచిట్టి కథలు చెప్పి వాటిని పిల్లలతో చెప్పించారు. శిక్షకులు నవాజ్‌జాన్, ఉపాధ్యాయులు జగదీశ్వర్‌రెడ్డి , క్రాఫ్ట్ శిక్షకులు రంగనాయకులు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

వాణిజ్యశాస్త్రంతో ఉజ్వల భవిష్యత్తు నిర్మాణం

వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ: వాణిజ్యశాస్త్ర అధ్యయనంతో ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూ వాణిజ్యశాస్త్ర విభాగం ఆచార్యులు డా.విజయభారతి ఆధ్వర్యంలో ‘కామ్ తరంగ్–2కే23’ పేరుతో విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లోని సెమినార్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ముందుకు సాగాలంటే ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానాన్ని పరస్పరం పెంపొందించుకునేందుకు ఇలాంటి వేదికలు దోహదం చేస్తాయన్నారు. ఆచార్య రఘునాథరెడ్డి , సీడీసీ డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు, కార్యక్రమ నిర్వాహకులు ఆచార్య విజయభారతి మాట్లాడుతూ వాణిజ్యశాస్త్ర విద్యార్థులకు అపార ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకునే నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఇన్నోవేషన్, ఎక్స్‌పో లోగో డిజైన్, బృంద చర్చ, రీసైకిల్ మానియా, పోస్టర్ మేకింగ్, క్విజ్, వన్‌మినిట్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. హరినాథ్, డా. రజనీ, డా. రఫీ, హరినాథరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.